కాలువలకు నీరు వదిలేనా..?

- సాగునీటి విడుదలలో స్పష్టత కరువు
- పనులు పూర్తి చేయని వైనం
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు
- సాగునీరొచ్చినా అధికారుల అలసత్వంతో నీటి విడుదలలో జాప్యం



ఘంటసాల గంజ కాలువ వద్ద అయినంపూడి డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

అవనిగడ్డ: అంగట్లో అన్నీ ఉన్నా.. కృష్ణా జిల్లా రైతుల దుస్థితి అగమ్యగోచరంగా ఉంది. నాగార్జున సాగర్ నుంచి సాగునీటిని విడుదల చేసినా పంటకాలువలకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ముందస్తు ప్రణాళిక లేకపోవడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, అధికారుల అలసత్వం జిల్లా రైతాంగానికి శాపంగా మారనుంది. పంటకాలువలు, డ్రెయిన్లకు మరమ్మతు పనులు చేపట్టకపోవడం పట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఆగ్రహం వ్యక్తం చేశారంటే రైతుల పట్ల పాలకుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది.

అసంతృప్తిలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు

ఈనెల 3వ తేదీన మచిలీపట్నంలో జరిగిన 42వ నీటి పారుదల సలహా మండలి సమావేశంలో పనుల జాప్యం పట్ల అధికార పార్టీ ఎమ్మెల్యేలే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. గన్నవరం నియోజకవర్గంలోని రామవరప్పాడు – పెరికీడు మధ్య పంటకాలువకు ఏడెనిమిది చోట్ల గండ్లు పడినా పూడ్చక పోవడం పట్ల ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుడమేరుకు పడిన గండ్లు పూడ్చలేదని, ఈ పనులు పూర్తి చేయకుండా పంటకాలువకు నీరు వదిలితే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. పెడన నియోజకవర్గంలోని చెన్నూరు డ్రెయిన్‌కు మరమ్మతులు చేయకుండా సాగునీరు వదలితే ఉపయోగం ఏమిటని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధికారులను నిలదీసిన విషయం విదితమే. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ జిల్లాలో ఎక్కడా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. పనులు ఎప్పుడు పూర్తిచేస్తారో? పంటకాలువలకు నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో అధికారుల నుంచి ఇంతవరకూ స్పష్టత లేకపోవడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టుల్లో నీరు లేనప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం జరగొచ్చని, కానీ నాగార్జున సాగర్ నుంచి సాగునీరు విడుదల చేసిన తరువాత కూడా సాగునీటి విడుదలలో జాప్యం చేయడం పట్ల రైతులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పంటకాలువలు, డ్రెయిన్లలో పనులు పూర్తి చేయించి త్వరగా సాగునీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పనులు పూర్తయ్యేనా ?..

నాగార్జునసాగర్ నుంచి విడుదల చేసిన సాగునీరు పులిచింతలలో నిల్వ చేశారు. ఈనెల 10వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా పంటకాలువలు, డ్రెయిన్ల పనులు పూర్తి చేయకపోవడం పట్ల సాగునీటి విడుదల జాప్యమయ్యే పరిస్థితులున్నాయి. అవనిగడ్డ నియోజకవర్గంలోని కేఈబీ కెనాల్‌తో పాటు అన్ని సాగునీటి సంఘాల పరిధిలో పంటకాలువలు, డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడికాడ తొలగింపునకు రూ.2.25 కోట్లు ఎస్‌డీఎంఎఫ్ నిధులు మంజూరు చేశారు. వీటిలో గుండేరు డ్రెయిన్‌లో పనులకు రూ.1.26 కోట్లు, రత్నకోడు డ్రెయిన్‌లో రూ.75.35 లక్షలు, లింగన్నకోడు డ్రెయిన్‌లో రూ.15.65 లక్షలతో పనులు చేపట్టాల్సి ఉంది. వీటిలో కొద్ది రోజుల క్రితం ఒకటి రెండు చోట్ల మాత్రమే పనులు ప్రారంభించారు. ఘంటసాల మండలంలో గుండేరు డ్రెయిన్‌లో ఇంకా పనులు ప్రారంభించలేదు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



కోడూరు 11వ నంబర్ పంట కాలువ దుస్థితి

నాగాయలంకలో అభివృద్ధి పనుల పరిశీలన

నాగాయలంక: జలక్రీడల శిక్షణ కేంద్ర నిర్మాణ లక్ష్యం నెరవేరుతుందని ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. నాగాయలంక కృష్ణానది తీరంలో కొనసాగుతున్న వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవనం పునఃనిర్మాణ పనుల పురోగతిని ఆదివారం ఆయన ఆకస్మిక పరిశీలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి ఒలింపిక్‌లో గోల్డ్ మెడల్స్ సాధించే సత్తా అందుకునే స్థాయికి ఎదిగి ఖేలో ఇండియా సెంటర్‌గా వెలుగొందాలన్నారు. ఈ మేరకు కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అభిలషించి డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ ట్రస్ట్ ద్వారా రూ.2 కోట్లు మంజూరు చేయడంతో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవనం పునః ప్రారంభ పనులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో రూ.15.50 లక్షలతో బీసీ బాలికల వసతి గృహంలో, రూ.7.6 లక్షలతో ఎస్సీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ పగడాల సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.



ఎస్సీ బాలికల హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చల్లపల్లి: సాగులో సరైన యాజమాన్య పద్ధతులను అవలంబించినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త జి.కృష్ణవేణి రైతులకు సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం(ఘంటసాల) ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాజేరు గ్రామంలో ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణవేణి మాట్లాడుతూ.. విత్తన శుద్ధి, భూసార పరీక్షలకు, పరిసరాల ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సరైన సమయంలో సరైన మోతాదులో మందులు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు సబ్సిడీపై అందించే వివిధ వ్యవసాయ పరికరాలు, పనిముట్ల మంజూరు వంటి విషయాలను ఏఓ సాయిసింధూ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డాక్టర్ సత్యప్రియ లలిత, ఎస్.శ్యామలాదేవి, ఉద్యానవన శాఖ అధికారి కీర్తి, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా వంగడాలు సాగు

ఎడ్లంక(అవనిగడ్డ): భూసార పరీక్షలకు అనుగుణంగా నూతన వంగడాలను సాగు చేసుకోవాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.మంజువాణి చెప్పారు. మండల పరిధిలోని పాత ఎడ్లంకలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజువాణి మాట్లాడుతూ కేవీకే ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు, ఘంటసాల వ్యవసాయ క్షేత్రంలో లభ్యమయ్యే విత్తనాల గురించి వివరించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలు, ఉద్యాన వన పంటలు, మామిడి, ఆయిల్‌ఫాం పంటల సాగులో మెలకువలు తెలియజేశారు. వ్యవసాయంలో నూతన యాంత్రీకరణ విధానాలపై అవగాహన కల్పించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సామ్రాజ్యం, ఆయిల్ ఫాం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కళ్యాణ్ బాబు, డాక్టర్ లహరి, ఏఓ శౌరమ్మ, రైతులు పాల్గొన్నారు.



పాత ఎడ్లంకలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మంజువాణి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బీజీకే జెడ్పీహెచ్‌ఎస్ 2002-03వ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పెడన: పట్టణంలోని బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌లో అంగరంగ వైభవంగా జరిగిన ఈ కలయికలో పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి గత మధురమైన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ స్థితిగతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా స్కూలు గ్రౌండ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నారు. 22 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకోవడం వారి ఆనందానికి అవధులు లేవంటూ వారి చిరునవ్వులు ద్వారా వ్యక్తపరిచారు. ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని వారు పేర్కొంటున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను మెమొంటోలు, శాలువాలతో సత్కరించారు. ఆనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు తమను గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించడం మరపురానిదన్నారు. కార్యక్రమంలో 2002–2003 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీలపై విద్యాశాఖ పట్టు వీడాలి

గుడివాడ టౌన్: ఉపాధ్యాయ బదిలీలపై విద్యాశాఖ మొండిపట్టు వీడాలని మంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్ కౌన్సెలింగ్ బదులుగా మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని ఉద్యోగ సంఘాలకు విద్యాశాఖ సంచాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్వయంగా సంచాలకులు ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తూ శనివారం నుంచి కింది స్థాయి విద్యాశాఖ అధికారులతో వెబ్ ఆప్షన్ నమోదు చేయాలని ఎస్జీటీలపై బలవంతం చేయడం దారుణమని పేర్కొన్నారు. డీఈఓ కార్యాలయంలో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నా విద్యాశాఖ అధికారులు పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఈ అంశంపై ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం ముట్టడి, ఆందోళన చేస్తున్నా విద్యాశాఖ మంత్రి స్పందించక పోవడం విచారకరమన్నారు. తక్షణమే విద్యాశాఖా మంత్రి జోక్యం చేసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇమ్మానుయేల్, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

కనులపండువగా వెంకన్న కౌతుకోత్సవం



విశేష అలంకరణలో స్వామివారు



పూజలు నిర్వహిస్తున్న ఉభయదాతలు

కోడూరు: కలియుగ వైకుంఠ దేవుడు కల్యాణ వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా సాగుతున్నాయి. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. రేపల్లెకు చెందిన చిట్టా మురళీకృష్ణ- ప్రియాంక దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కౌతుకోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. నవకలశ స్నాపన ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక జలాలతో స్వామివార్ల ఉత్సవమూర్తులకు అభిషేకాలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను చందనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శనివారం రాత్రి ప్రధాన సెంటర్‌లో స్వామివారి రాయబారోత్సవాన్ని నిర్వహించారు. ఉపన్యాస వాచస్పతి మొవ్వ వృషాద్రిపతి వాఖ్యతగా వ్యవహరించి, స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తులకు వివరించారు. బ్రహ్మోత్సవాల్లోని ప్రధాన ఘట్టాలను, విశిష్టతను అనుగ్రహభాషణ చేశారు. వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వెంకటేశ్వరుడి వేషధారణలో ఓ కళాకారుడు ఆకట్టుకున్నాడు.

స్వామివార్లకు పట్టువస్త్రాల సమర్పణ..

కల్యాణోత్సవానికి ఉభయ దాతలుగా వ్యవహరించిన దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. తమ నివాస గృహాల వద్ద నుంచి మంగళవాయిద్యాల నడుమ ప్రధాన రహదారి పొడవునా చలువబట్టలపై నడుచుకుంటూ వచ్చి వస్త్రాలను పండితులకు అందజేశారు. రాత్రికి కల్యాణం, సోమవారం వాహనసేవలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తులతో పులకించిన శ్రీరామపురం

కోడూరు: 'జై శ్రీరామ్.. జై హనుమాన్' అంటూ భక్తులు చేసిన శ్రీరామ నామస్మరణతో శ్రీరామపురం గ్రామం పులకించింది. మండలంలోని ఉల్లిపాలెం శివారు శ్రీరామపురం గ్రామంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున దాతల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో గతేడాది సీతారాములవారి ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో మూడు రోజుల నుంచి గ్రామంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 7.47 గంటలకు స్వామివార్ల నల్లరాతి ఏకశిలా విగ్రహాలను భక్తుల జైజై ధ్వానాల మధ్య ఆలయంలో ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠతను పురస్కరించుకొని ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేదపండితులు కాశీభోట్ల శ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో ప్రతిష్ఠ జరిగింది. యాగశాలలో ప్రత్యేక హోమాలు చేసి, పూర్ణాహుతిని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. స్వామివార్ల ప్రతిష్ఠను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో సీతారాములవారి శాంతి కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. ఆరుగురు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి కల్యాణాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు గ్రామానికి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయం వద్ద అన్నసమారాధనను నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను ఆలయ కమిటీ సత్కరించింది.



స్వామివార్ల శాంతికల్యాణం నిర్వహిస్తున్న ఉభయదాతలు

ఆకట్టుకున్న జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు

చల్లపల్లి: స్థానిక నందమూరి తారక రామారావు పార్కులో ఆదివారం ప్రదర్శించిన జానపద పౌరాణిక నాటక ప్రదర్శలను ఆద్యంతం ప్రేక్షకులను అలరించాయి. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ, రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు సహకారంతో సాయంత్రం నుంచి ఈ ప్రదర్శనలు ప్రదర్శించారు. గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నాని), మల్లీశ్వరీ దంపతుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత బాల దుర్యోధనుడిగా బొల్లా నిర్దేష్‌సాయి, ఝాన్సీలక్ష్మీబాయిగా లాక్షణ్య చంద్రిక, జరీనా సిరి చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రామారావు ప్రదర్శించిన దుర్యోధన మయసభ ఏకపాత్రాభినయం ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసింది.

కళాకారులకు సన్మానం..

ప్రముఖ స్టేజీ, సినీ ఆర్టిస్ట్ పస్తుల విజయ్‌కుమార్ ఆంజనేయునిగా, బొడ్డు రంగారావు గరుత్మంతునిగా రామభక్త హనుమాన్ నాటకం నుంచి ఆంజనేయుని యుద్ధసీను ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు. కళాకారులను గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, సజ్జా చలపతిరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, రావెళ్ల ఉదయ్, ఆకుల స్వాభూప్రసాద్, గుడివాక శివరామ్, యాసం చిట్టిబాబు, దాసీ సీతారామరాజు, వేమూరి రత్నగిరి, అడపా రాంబాబు, బొల్లా కిశోర్, యోగా గురూజీ శ్రీనివాస్, కళాకారులు, ఆర్‌ఎంపీ పేర్ని మధు సత్కరించారు. ప్రదర్శనలకు ఆర్కెస్ట్రా గుడివాడకు చెందిన రాజా పైడేశ్వరరావు, మేకప్ మల్లంపల్లి సుబ్బయ్య, సౌండ్‌సిస్టమ్ ఎం.నాగరాజు, లైటింగ్ చంద్ర, గోపిలు స్వీయపర్యవేక్షణలో నిర్వహించారు. నాటక ప్రదర్శనలు వీక్షించేందుకు అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు.



బోలెం రామారావును సత్కరిస్తున్న ప్రముఖులు

ఉచిత మధుమేహ వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్య చౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ శిబిరంలో 165 మందికి పరీక్షలు జరిగాయని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. 15 రోజులకు సరిపడా ఉచిత మందులను రోగులకు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్ష



పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మెగా డీఎస్సీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 180 మందికి గాను 174 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి 147 మంది హాజరయ్యారని, 33 మంది గైర్హాజరయ్యారన్నారు. రెండు సెషన్స్‌లో 39 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులచే మూడు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు, అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం ఉదయం 6 గంటలకు మండప దేవతా పూజలు, మూల మంత్ర హోమాలు, కళాహోమం, మంత్ర స్థాపన, తదుపరి విగ్రహ స్థాపనములు నిర్వహించి పూర్ణాహుతి, నేత్రోన్మీలనం, ధేను దర్శనం, కుంభం పోయడం, కళాన్యాసములు, అవభృత స్నానం, మహాదాశీర్వచనాలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీరాంబాబు, మాజీ సర్పంచ్ కేసాని శివుడు, ఎంపీటీసీ సభ్యులు దిడ్ల రాణి, మండల కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణ, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు కిట్లు అందజేత



చల్లపల్లి: విద్యలో ఉన్నతంగా రాణించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని విజయవాడకు చెందిన మైత్రాసనం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్‌రాజ్ బాలబాలికలకు సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శాలిపేటలోని ఆర్సీఎం చర్చిలో ఆదివారం తోట సునీల్‌రాజ్ ఆధ్వర్యంలో 105 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, వాటర్‌బాటిల్, జామెట్రిక్ బాక్స్‌లతో కూడిన కిట్లను అందజేశారు. చర్చి పరిధిలోని 12 గ్రామాల్లో ఉన్న విశ్వాసుల కుటుంబాలకు చెందిన ఒకటో తరగతి నుంచి 10 తరగతి చదివే పిల్లలకు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు విలువ చేసే, మొత్తం రూ.1.05 లక్షల విద్యా సామగ్రితో కూడిన కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా తోట సునీల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదగాలంటే మొదటిగా చేయవలసిన పని చదువుకుని జ్ఞానాన్ని సంపాదించుకోవటమేనన్నారు. పిల్లలందరూ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో మరో పదిమందికి సాయపడేలా దేవుని ఆశీర్వాదం ఉంటుందని చెప్పారు. ఆర్సీఎం చర్చి ఫాదర్ బిరుదుగడ్డ రవికుమార్ ఈసందర్భంగా క్రీస్తు వాక్యాలను ఉపదేశించారు. మరియదళ సభ్యులు ప్రార్థనా గీతాలను ఆలపించారు.

పీపీఎల్ విజేత కేటీఎం జట్టు



గూడూరు: అంబేద్కర్ మెమోరియల్ పతాన్‌పేట ప్రీమియర్ క్రికెట్టు లీగ్ విజేతగా కేటీఎం జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో కేటీఎం జట్టు ఐదుగుళ్లపల్లి జట్టుపై ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో కేజీఎఫ్ సినిమా ఫేమ్ గరుడరామ్ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. వైరం సినిమా డైరెక్టర్ సాయిశివరామ్‌తో కలసి ఆయన విజేతలకు బహుమతులు అందజేసి, అభినందించారు. కార్యక్రమానికి నిర్వాహకులు, క్రీడాకారులు, సినీ ప్రముఖులు రావడంతో గ్రామంలో సందడి నెలకొంది.

మజ్జిగ పంపిణీ

గుడివాడటౌన్: తారకరామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక విజయవాడ రోడ్‌లోని చిన్నం గంగాధర్‌రావు ఇంటి వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మజ్జిగ పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఎం.బ్రహ్మయ్య తెలిపారు. క్లబ్ సభ్యుడు నూకల అరుణ్ వితరణతో పంపిణీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి.సతీష్‌బాబు, సీహెచ్ సుబ్రహ్మణ్యం, పి.సూరిబాబు, జి.రవీంద్ర కుమార్, కె.రామకృష్ణ, ఎం.వీరశేఖర్, డి.వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ



ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల గ్రామం ఆదివారం శ్రీకృష్ణ నామ స్మరణతో మార్మోగింది. ఘంటసాల గ్రామంలో వేం చేసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బాల పార్వతీ జలధీశ్వర స్వామి ఆలయం వద్ద రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ ద్వారక ఆలయం శిఖర, శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చావలి దుర్గామల్లికార్జున దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం తెల్లవారు జామున 5 గంటలకు నిత్యవిధి, గర్తన్యాసము, పీఠన్యాసము, రత్నలోహన్యాసము, ధాతున్యాసము పూజలు నిర్వహించి ఉదయం 7.42 గంటలకు శ్రీకృష్ణ ద్వారకా ఆలయ శిఖర ప్రతిష్ఠ, శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం కుంభాభిషేకం, దశ దర్శనం, ఆశీర్వచనము, కంకణ విమోచనతో పూజాది కార్యక్రమాలు ముగిశాయి.

3 వేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన

శ్రీకృష్ణ ద్వారాకా ఆలయం శిఖర, శ్రీ కృష్ణ పరమాత్ముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఘంటసాల గ్రామంతో పాటు చిలకలపూడి, పుచ్చగడ్డ, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఘంటసాల కోలాహలంగా మారింది. ఆలయ, శిఖర, విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 3 వేల మందికి పైగా భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా గంగానమ్మ తల్లి వాయు విగ్రహ ప్రతిష్ఠ

టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీగంగానమ్మ తల్లి వాయు ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ గూడూరు రామకృష్ణ శర్మ, శిష్య బృందం నేతృత్వంలో నిత్యవిధి, పీఠన్యాసం, రత్నన్యాసం, యంత్ర స్థాపన, పూర్ణాహుతి, కుంభాభిషేకం, అవభృతస్నానం, వేద ఆశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నసంతర్పణ జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కృత్తివెన్ను: తీరప్రాంతంలో కోట్లాది రూపాయలతో ఆధునాతనంగా నిర్మించిన శివాలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం స్వామి వారి ప్రధాన విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శ్రీ అన్నపూర్ణా సమేత ఓంకారేశ్వరస్వామివార్లు, శ్రీ పరివార సహిత బింబ-యంత్ర- శిఖర, ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆరుగురు విద్యార్థులకు షైన్ స్టార్స్ ప్రతిభా అవార్డులు

నాగాయలంక: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతిలో అధిక మార్కులతో నాగాయలంక మండలంలో ఆరుగురు విద్యార్థులు షైన్ స్టార్స్ ప్రతిభా అవార్డులు దక్కించుకున్నారని ఎంఈఓ టీవీఎం రామదాసు ఆదివారం చెప్పారు. తలగడదీవి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మండలి పవిత్ర, భోగాది గాయత్రిశ్రీ సహస్ర, నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తం గెళ్లమూడి యామిని, నాయుడు యశ్వంత్, స్కాలర్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులు చెరుకూరి సంజయ్, కందుల గ్లోరి ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అవార్డు కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం సోమవారం మచిలీపట్నంలో విద్యాశాఖ అధికారులు అందిస్తారని ఎంఈఓ చెప్పారు.

పాండురంగడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడిలో వేంచేసి ఉన్న శ్రీ పాండురంగస్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావటంతో పాటు మసులా బీచ్ ఫెస్టివల్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రజలు పాండురంగస్వామి ఆలయనికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని పలు ఉపాలయాల్లో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లను కూడా భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్మాహకుడు టేకి నరసింహం తీర్థప్రసాదాలను అందజేశారు. బీచ్ ఫెస్టివల్‌కు వెళ్లి సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఆలయానికి వచ్చే వీలు లేకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించటంతో స్వామి వారిని దర్శించుకునే వీలులేక పలువురు భక్తులు నిరాశ చెందారు.